క్లుప్తంగా


ఘనంగా రామాలయ ప్రతిష్ట



రామాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అప్పలనర్సయ్య, ఎమ్మెల్సీ సురేష్‌బాబు, తదితరులు

దత్తిరాజేరు: మండలంలోని బలభద్రరాజపురంలో శుక్రవారం నిర్వహించిన రామాలయ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వైస్ ఎంపీపీ మిత్తిరెడ్డి రమేష్, పోరలి సర్పంచ్ ధనలక్ష్మి దంపతులు ఆర్థిక సాయంతో నిర్మించిన ఆలయంలో కణింకోటకు చెందిన వేదపండితుడు రేజేటి రామాచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ నేరేడుబిల్లి గురునాయుడు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలం తాటిగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన సోపేటి శశికల, వాకలపూడి రూప, గుసిడి దామోదరరావు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం మధుసూదన్ శుక్రవారం తెలిపారు. వీరు ఈ నెల 5న గుంటూరు జిల్లా తాడికొండలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

వంటపాత్రలు అందజేత



వంటపాత్రలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు సన్యాసినాయుడు

గుర్ల: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడ సత్తా చాటాలని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పాట్నూరు సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని పాలవలస ప్రాథమిక పాఠశాల ఎండీఎం నిర్వాహకులకు ప్రభుత్వం అందించిన వంట పాత్రలను, విద్యార్థులకు క్రీడా కిట్లను శుక్రవారం అందజేశారు. విద్యార్థులకు నాణ్యమైనా పౌష్టికాహారం అందించాలని వంట నిర్వాహకులకు సూచించారు. మండలంలోని లవిడాంలో ఎండీఎం నిర్వాహకులకు వంటపాత్రలను, విద్యార్థులకు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా క్రీడా కిట్లను వైఎస్సార్‌సీపీ నాయకుడు బూర్లె అప్పలస్వామి, తవుడు అందజేశారు.

మోడల్ పాఠశాల సందర్శన



విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ బ్రహ్మాజీరావు

దత్తిరాజేరు: మండలంలోని షికారుగంజి వద్ద ఉన్న మోడల్ పాఠశాలను జిల్లా ఉప విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు శుక్రవారం సందర్శించారు. ముందుగా మధ్యాహ్న భోజనాలను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. భోజనం బాగుందా లేదా? మెనూ ప్రకారం అందిస్తున్నారా లేదా? తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు, నోట్‌బుక్స్ పూర్తిస్థాయిలో అందాయా లేదా అని అడగగా.. అన్నీ బాగున్నాయని విద్యార్థులు సమాధానం ఇచ్చారు. పదో తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసన్నకు సూచించారు.

బీజేపీ నూతన కార్యాలయం ప్రారంభం

గజపతినగరం: మండల కేంద్రంలో బీజేపీ నూతన కార్యాలయాన్ని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్.ఈశ్వరరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదల సంక్షేమం కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని, వాటిని ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ బలోపేతం కోసం కృషిచేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ నెల 21న పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి జిల్లాకు వస్తున్నారని, ఆ రోజు జరిగే కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు తప్పకుండా హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవర ఈశ్వరరావు, జిల్లా ఇన్‌చార్జ్ రామరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమంచి సుబ్బారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్ వర్మ, బొబ్బిలి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

విచారణ లేకుండా ఓట్లు తొలగించం

- తప్పుడు క్లయిమ్స్ చేసిన వారిపై క్రిమినల్ కేసు
- ఈఆర్ఓ సుదర్శనదొర



చీపురుపల్లి రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ శాంతి



కొత్తవలస: మాట్లాడుతున్న ఈఆర్ఓ సుదర్శనదొర

కొత్తవలస: సమగ్ర విచారణ లేకుండా ఓటర్ల జాబితా నుంచి ఒక్క ఓటు కూడా తొలిగించమని, ఓట్లు తొలిగిస్తున్నారంటూ వస్తున్న వదంతులు నమ్మొద్దని, దీనిపై బీఎల్ఓలు ఓటర్లకు అవగాహన కల్పించాలని నియోజకవర్గ ఈఆర్ఓ సుదర్శనదొర అన్నారు. కొత్తవలస, లక్కవరపుకోట మండల కేంద్రాల్లో బీఎల్ఓలు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన బూత్ లెవెల్ ఏజెంట్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. 18 సంవత్సరాలు నిండిన యువత ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. ఒకే వ్యక్తి వంద ఓట్లు తొలిగింపుకు దరఖాస్తు చేస్తే సదురు దరఖాస్తుపై ప్రత్యేక విచారణ చేపడతామన్నారు. తప్పుడు ఆరోపణలు అని నిర్ధారణైతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రతీ బీఎల్ఓ ఓటర్ జాబితాను తీసుకొని ఇంటింటికీ వెళ్లి ప్రత్యేక విచారణ చేయాలన్నారు. ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ సర్వేకు సహకరించాలని కోరారు. ఓటర్ల జాబితా పారదర్శకంగా, పక్కాగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఫారం-6, 6ఎ, 7, 8లు అప్లై చేసుకునేందుకు వచ్చే నెల 11 వరకు అవకాశం ఉందన్నారు. ఓటు స్థితి గతులను తెలుసుకునేందుకు ప్రభుత్వం హెల్ప్‌లైన్ సర్వీస్‌ను ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో కొత్తవలస, ఎల్.కోట మండలాల ఏఈఆర్ఓలు శ్రీనివాసమిశ్రా, కళ్యాణ్ చక్రవర్తి, ఆయా మండలాల డిప్యూటీ తహసీల్దార్‌లు రమేష్, రాజేశ్వరరావు, నియోజకవర్గం ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీఎల్ఓలు సక్రమంగా విధులు నిర్వర్తించాలి

బీఎల్ఓలు సక్రమంగా పనిచేయాలి: ఆర్డీఓ

చీపురుపల్లి రూరల్(గరివిడి): బీఎల్ఓలు తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని ఆర్డీఓ శాంతి అన్నారు. గరివిడి మండల పరిషత్ కార్యాలయంలో చీపురుపల్లి, గరివిడి మండలాలకు చెందిన బీఎల్ఓలతో శుక్రవారం సమావేశమయ్యారు. అర్హులైన ప్రతీ ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలని సూచించారు. డిసెంబర్ 12 వరకు కొత్త ఓట్లు నమోదు చేసేందుకు అవకాశం ఉందన్నారు. నిర్ధేశిత గడువులో పోలింగ్ కేంద్రాల మార్పిడి, ఓటర్ల జాబితాలో తప్పుల, ఒప్పుల సవరణ, మరణించిన వారి ఓటు తొలగించే ప్రక్రియ సక్రమంగా జరగాలన్నారు. ఈనెల 4,5 తేదీల్లో బీఎల్ఓలు పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో చీపురుపల్లి తహసీల్దార్ ఎం.సురేష్ ఉన్నారు.


ఓటర్లుగా చేరండి.. భవిష్యత్‌ను రాయండి



ఓటు నమోదు దరఖాస్తులు ప్రదర్శిస్తున్న అధికారులు, విద్యార్థులు

శృంగవరపుకోట: రాజ్యాంగం ఇచ్చిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సక్రమంగా వినియోగించుకోవాలని తహసీల్దార్ డి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులకు శుక్రవారం ఓటుహక్కుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అక్టోబర్ 27 నుంచి డిసెంబర్ 9 వరకు ఓటు నమోదు, సవరణ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. డిసెంబర్ 2,3 తేదీల్లో నిర్వహించే స్పెషల్ క్యాంపెయిన్‌లో బీఎల్ఓలు పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంటారని, ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఓటు నమోదు దరఖాస్తులను తీసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ కీర్తన, కళాశాలల ప్రిన్సిపాల్ డా.సి.హెచ్.కేశవరావు, బీఎల్ఓలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించం



పీహెచ్‌సీ సిబ్బంది నుంచి వివరాలు సేకరిస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ సురేష్‌బాబు

దత్తిరాజేరు: వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలందించాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు తప్పవని ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య, ఎమ్మెల్సీ సురేష్‌బాబు అన్నారు. పీహెచ్‌సీ సిబ్బంది నిర్లక్ష్యంపై శుక్రవారం సాక్షి పత్రికలో వచ్చిన కథనంపై వారు స్పందిచారు. దత్తిరాజేరు పీహెచ్‌సీని శుక్రవారం సందర్శించి డాక్టర్ ఆనంద్‌కుమార్, ఫార్మసిస్ట్ సీతారాంతో మాట్లాడి వివరాలు సేకరించారు. మందుల పంపిణీ, రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరుపై అధికారుల పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోందని, వైద్యుడితో పాటు ఫార్మసిస్ట్‌పై చర్యలకు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. వారి వెంట ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు, జడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, వైస్ ఎంపీపీ బమ్మిడి అప్పలనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు రాపాక కృష్ణమూర్తి, జేసీఎస్ కన్వీనర్ ఫణీంద్రుడు ఉన్నారు.

సామూహిక సీమంతాలు



సామూహిక సీమంతాలు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ రఘురాజు, సుధారాజు, తదితరులు

శృంగవరపుకోట: పట్టణంలోని ఎరుకమ్మ పేరంటాలు కళ్యాణ మండపంలో జగతి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలను శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందిస్తోందని, వాటిని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పుట్టబోయే బిడ్డ ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని పౌష్టికాహార పంపిణీతో పాటు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. జగతి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు, ఎస్.కోట మండల వైస్ ఎంపీపీ సుధారాజు, సంస్థ సభ్యులను ఎమ్మెల్సీ రఘురాజు అభినందించారు. సంస్థ సభ్యులు గర్భిణులకు పసుపు, కుంకుమ, గాజులు, పండ్లు, పూలు, స్వీట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సోమేశ్వరరావు, జెడ్పీటీసీ వెంకటలక్ష్మి, కొత్తవలస జెడ్పీటీసీ నెక్కల శ్రీదేవి, సర్పంచ్ సంతోషికుమారి, జి.స్వాతిరత్నం, ఆవాల శ్యామల, స్వప్న, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్రైసైకిళ్లు అందజేత



అప్పలనాయుడుకు ట్రైసైకిల్ అందిస్తున్న జెడ్పీ చైర్మన్

మెరకముడిదాం: మండలంలోని బైరిపురం గ్రామానికి చెందిన దివ్యాంగుడు తాడ్డి జస్వంత్, ఉత్తరావల్లి గ్రామానికి చెందిన మండల నారాయణ అప్పలనాయుడుకు జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు శుక్రవారం జెడ్పీ కార్యాలయం ఆవరణలో బ్యాటరీ ట్రైసైకిళ్లను అందజేశారు. దివ్యాంగులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మెరకముడిదాం మండల వైఎస్సార్‌సీపీ నాయకులు తాడ్డి వేణు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్‌వీ రమణరాజు (పెద్దబాబు), వైస్ ఎంపీపీ టి.హరిబాబు, పప్పల కృష్ణ, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలి

మెరకముడిదాం: మండలంలో జగనన్న ఇల్లు మంజూరైన లబ్ధిదారులు త్వరగా ఇంటి నిర్మాణం పూర్తి చేయాలని, లేదంటే నిర్మాణం ఏ దశలో ఉన్నా రద్దు చేయడం జరుగుతుందని హౌసింగ్ ఏఈ ఎం.వెంకటరమణ అన్నారు. తన కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. మండలానికి సంబంధించి మొత్తం 1972 ఇళ్లు మంజూరు కాగా, అందులో 1488 ఇళ్ల నిర్మాణాలు పూర్తయినట్లు చెప్పారు. 88 నిర్మాణాలు శ్లాబు వరకు, 110 నిర్మాణాలు శ్లాబు ఎత్తు వరకు, 157 నిర్మాణాలు పునాదుల దశలో ఉన్నట్లు వెల్లడించారు. 129 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం కాలేదని తెలిపారు. నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులు వెంటనే ప్రారంభించాలని, నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నవారు వాటిని పూర్తిచేయాలని సూచించారు. లేదంటే కలెక్టర్ ఆదేశాల మేరకు ఇల్లు రద్దు చేయడం జరుగుతుందన్నారు.

జియోట్రాకింగ్ పరికరం తప్పనిసరి

జామి: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో కొనుగోలు చేసిన ధాన్యం రవాణాకు వినియోగించే వాహనాలకు జియో ట్రాకింగ్ పరికరాలను తప్పనిసరిగా అమర్చుకోవాలని వ్యవసాయాధికారి కిరణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రమైన జామి, చింతాడ గ్రామాల్లో శుక్రవారం గ్రామ వ్యవసాయ సలహామండలి సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జియో ట్రాకింగ్ అమర్చుకోవాలన్నారు. వాహన యజమాని రైతు అయితే రూ.2470 చెల్లించాలన్నారు. మొదటిసారి రవాణా చేసేటప్పుడు ప్రభుత్వం చెల్లించే రవాణాతో పాటు జీఎస్టీతో పాటు రూ.2970 మినహాయించుకుని నగదు రైతుల ఖాతాకు జమచేయబడతాయన్నారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో రైతులు వరిపంటకు మల్టీ-కె మందును 5గ్రాములు చొప్పున లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలన్నారు.

మైక్‌సెట్ వితరణ

వేపాడ: మండలంలో చినగుడిపాల గ్రామానికి చెందిన నచ్చిరెడ్డి దేముడునాయుడు గ్రామంలోని సీతారామాలయానికి మైక్ సెట్ వితరణ చేసినట్లు సర్పంచ్ బోజంకి రామునాయుడు శుక్రవారం తెలిపారు. దేముడునాయుడు తన తల్లిదండ్రులు నచ్చిరెడ్డి పెద్దతాతఅప్పడమ్మ దంపతుల జ్ఞాపకార్థం రూ.31 వేలు విలువ చేసే మైక్‌సెట్, ఆంప్లిఫైయర్ అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వేచలపు నాయుడుబాబు, వేచలపు రామకృష్ణ, కోట అప్పలనాయుడు, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ మృతికి సంతాపం

దత్తిరాజేరు: మండలంలోని గడసాం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ నేతేటి సన్యాసమ్మ(80) శుక్రవారం సాయంత్రం మృతి చెందినట్లు ఆమె కుమారుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు వెంకటరమణ తెలిపారు. ఆమె గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్దే మృతి చెందారు. ఆమె మృతి పట్ల పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. ఆమె మనవరాలు నేతేటి దీపిక ప్రస్తుతం గ్రామ సర్పంచ్‌గా సేవలందిస్తున్నారు.

తాగునీటి బోరు ప్రారంభం

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలం కుమరాం ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన తాగునీటి బోరును ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, ఎంపీటీసీ రఘుమండ శ్రీదేవి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరావు మాట్లాడుతూ.. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2 లక్షలతో పాఠశాలలో హేండ్ బోరు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. అనంతరం ప్రభుత్వం సమకూర్చిన క్రీడా కిట్లు, మధ్యాహ్న భోజన వంటపాత్రలను పాఠశాలకు అందజేశారు. కార్యక్రమంలో రఘుమండ చంద్రకుమార్, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రవచనాల బోధన

చీపురుపల్లి: చీపురుపల్లి ప్రాంత వాసుల ఇలవేల్పు శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని శుక్రవారం బాలబ్రహ్మానంద సరస్వతి సందర్శించారు. ఈ సందర్భంగా కనకమహాలక్ష్మి లీలా విలాసంపై భక్తులకు ప్రవచనాలు బోధించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావు, ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి సూర్యప్రకాశ్, వైస్ చైర్మన్ సూరు వెంకటకుమారస్వామి, వంకల కృష్ణ, కంది శ్రీరాములు, బుంగ కనకేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం

బొండపల్లి: మండల కేంద్రం బొండపల్లిలో జాతీయ రహదారి26ను అనుకుని నివాసం ఉంటున్న ఒంటరి మహిళ రాళ్లపూడి లక్ష్మికి చెందిన పూరిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా శుక్రవారం మధ్యాహ్నం దగ్ధమైంది. లక్ష్మి ఇంట్లో లేని సమయంలో మంటలు ఒక్కసారిగా వ్యాపించి పూర్తిగా కాలిపోవడంతో బాధితురాలు కట్టుబట్టలతో మిగిలింది. ఈ ప్రమాదంలో సుమారు లక్ష రుపాయల వరకు ఆస్తినష్టం సంభవించి ఉంటుందని అంచనా. వీఆర్ఓ రవి సంఘటనా స్థలాన్ని పరిశీలించి నివేదికను ఉన్నతాధికారులకు అందజేశారు. సమాచారం మేరకు గజపతినగరం అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలును అదుపు చేసి మిగతా ఇళ్లకు వ్యాపించకుండా చూశారు.

అవినీతి నిర్మూలనకు కృషి

వేపాడ: మండలంలో జాకేరు ప్రాథమికోన్నత పాఠశాలల్లో శుక్రవారం ఎస్.కోట యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జాతీయ జాగురుకత వారోత్సవాలు (విజిలెన్స్ అవేర్నెస్ వీక్) నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం, పోటీలు నిర్వహించారు. విజేతలకు బ్రాంచ్ మేనేజర్ వై.సురేంద్రకుమార్, అసిస్టెంట్ మేనేజర్ మౌనిక, గీత బహుమతులు అందజేశారు. బ్రాంచ్ మేనేజర్ సురేంద్రకుమార్ మాట్లాడుతూ.. అవినీతిని నిర్మూలించినపుడే అర్హులకు వారు కొరుకున్నది లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం అప్పలసత్యం, రామసత్యం, అప్పారావు, సచివాలయ కన్వీనర్ బుద్ధా కృష్ణ, కోలావీరన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యంపై కేసు నమోదు

మెంటాడ(గజపతినగరం రూరల్): మండలంలోని బంగారమ్మపేట గ్రామంలో డొంక చిన్నంనాయుడు అనే వ్యక్తి విద్యుత్ చౌర్యానికి పాల్పడటంతో అతనిపై కేసు పెట్టడంతో పాటు జరిమానా విధించినట్లు విద్యుత్ శాఖ ఏఈ కృష్ణమూర్తి శుక్రవారం తెలిపారు. గత వారం రోజులుగా చిన్నంనాయుడు అక్రమంగా విద్యుత్‌ను వినియోగస్తున్నట్లు ఫిర్యాదు అందడంతో వెళ్లి తనిఖీ చేసినట్లు చెప్పారు. చౌర్యం చేస్తున్నట్లు గుర్తించి తక్షణమే కేసు నమోదు చేస్తూ ఆయనకు నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు.

విద్యుత్ సమస్యలపై రివ్యూ మీటింగ్

మెంటాడ(గజపతినగరంరూరల్): నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో జరిగిన మండల సర్వసభ్య సమావేశాల్లో విద్యుత్ సమస్యలపై సభ్యులు ఫిర్యాదులు చేయడంతో ఆయా మండలాల విద్యుత్‌శాఖ అధికారులతో రివ్యూ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య శుక్రవారం తెలిపారు. ప్రజాప్రతినిధులు తమ ప్రాంతంలోని విద్యుత్ సమస్యలపై పూర్తిస్థాయి సమాచారంతో సిద్ధంగా ఉండాలన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమావేశ తేదీని త్వరలోనే వెల్లడించనున్నట్లు చెప్పారు.

అర్హతే ప్రమాణికం

గుర్ల: సంక్షేమ పథకాలకు అర్హతే ప్రమాణికమని జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పాట్నూరు సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని గుజ్జింగివలసలో 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. గ్రామంలోని ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే చేరుస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జమ్ము స్వామినాయుడు, సర్పంచ్ రెడ్డి పద్మావతి, ఎంపీటీసీ అట్టాడ సంధ్యారాణి, గూడేం సొసైటీ అధ్యక్షుడు రెడ్డి మురళిధరరావు, నాయకుడు రెడ్డి అప్పలనర్సయ్య, అప్పలరాజు పాల్గొన్నారు.

నేడు కన్వర్జన్సీ సమావేశం

బొండపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై.వి.రాజేంద్రప్రసాద్ తెలిపారు. మండల ప్రత్యేకాధికారి ఆధ్వర్యంలో ఉదయం పదిన్నర గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

104 ఉద్యోగుల వినతి



ఎమ్మెల్యే శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇస్తున్న 104 ఉద్యోగులు

శృంగవరపుకోట: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యంగా అహర్నిశలూ పనిచేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని 104 ఎం.ఎం.యూ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, ఉద్యోగులు కోరారు. తమను పీహెచ్‌సీల్లో నేరుగా విధుల్లోకి తీసుకోవాలని, తమ విన్నపాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్లాలని కోరుతూ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు.

బాధ్యులపై చర్యలు



వివరాలు సేకరిస్తున్న జిల్లా ఉప వైద్యాధికారి రవికుమార్

దత్తిరాజేరు: విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందిపై చర్యలు తీసుకోనున్నట్లు జిల్లా ఉపవైద్యాధికారి రవికుమార్ తెలిపారు. శుక్రవారం పత్రికల్లో వచ్చిన కాలం చెల్లిన ఎంఆర్ వ్యాక్సిన్ పంపిణీ కథనంపై విచారణ చేపట్టారు. పీహెచ్‌సీని సందర్శించి వివరాలు సేకరించారు. కాలపరిమితి దాటిన వ్యాక్సిన్‌ను ఎందుకు ఫ్రిడ్జ్‌లో ఉంచారు, కాలపరిమితి చూడకుండా ఎలా పంపిణీ చేస్తారని సిబ్బందిపై మండిపడ్డారు. బాధ్యులపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్యుల మధ్య గత కొంత కాలంగా విభేదాలు రావడంతో మందుల నిల్వలకు సంబంధించి రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడం, మూడు నెలల ముందుగా కాలపరిమితి దాటుతున్న మందులను గుర్తించడంలో సిబ్బంది విఫలమయ్యారని అన్నారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపించి, వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

మండలంలో వర్షాభావ పరిస్థితులు



అధికారులను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు, ఎంపీపీ సోమేశ్వరరావు, తదితరులు

- 2 వేల ఎకరాల్లో పంటలపై ప్రభావం
- మండల సమావేశంలో ఏఓ రవీంద్ర

శృంగవరపుకోట: వరిచేలు ఎండిపోతున్నాయి. నీరు లేక రైతులు అవస్థలు పడుతున్నారు. చాలా మండలాలను కరువు మండలాలుగా గుర్తిస్తున్నారు. ఇక్కడ అటువంటి ప్రయత్నాలు చేస్తున్నారా అంటూ పలువురు సభ్యులు అధికారులను ప్రశ్నించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సండి సోమేశ్వరరావు అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వ్యవసాయశాఖపై జరిగిన చర్చ సందర్భంగా సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఏఓ రవీంద్ర బదులిస్తూ.. ప్రస్తుతం మండలంలో సుమారు 2వేల ఎకరాల్లో వరిపంట సాగుపై వర్షాభావ పరిస్థితుల ప్రభావం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. వారం రోజుల పాటు పరిస్థితి ఇలాగే ఉండే మరో 9700 ఎకరాల్లో వరిపంటపై ఆ ప్రభావం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. కరువు ప్రకటించేందుకు నిర్ధిష్టమైన ప్రామాణికాలు ఉన్నాయని, మండలంలోని పరిస్థితిని ఎప్పటికప్పుడు జిల్లా అధికారులకు తెలియచేస్తున్నామన్నారు. తహసీల్దార్ డి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సాధారణ ఎన్నికలకు డ్రాఫ్ట్ పబ్లికేషన్ వచ్చిందని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకునేలా యువతకు అవగాహన కల్పించాలని సూచించారు. ఓటరుగా నమోదు చేసుకునేందుకు డిసెంబరు 9 వరకు గడువున్నట్లు చెప్పారు. పి.కె.పల్లిలో ఇళ్ల స్థలాల కోసం ప్రతిపాదనలు పంపామని, ప్రభుత్వం సదరు భూమి హక్కుదారులకు సొమ్ము ఇచ్చిన తర్వాత పనులు ప్రారంభిస్తామన్నారు. సీఎస్‌డీటీ శ్రీనివాసరావు మాట్లాడుతూ..పి.కె.పల్లి, తలారి, వీరనారాయణం రేషన్ డిపోల డీలర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వచ్చిందన్నారు. విద్యుత్ శాఖపై జరిగిన చర్చలో ఏఈ రవికుమార్ మాట్లాడుతూ.. కొత్తగా 11 ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశామని, స్తంభాలు మార్చాలంటే డీడీ తీయాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్సీ రఘురాజు, ఎంపీపీ సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ సుధారాజు మాట్లాడుతూ.. అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో "జగనన్న ఆరోగ్య సురక్ష" కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారన్నారు. అందుకుగాను ఎంపీడీఓ శేషుబాబు, కొట్టాం వైద్యాధికారి ఝాన్సి, ఈఓపీఆర్డీ లక్ష్మీలను సన్మానించారు.

ఆతవ గ్రామంలో అధికారుల పర్యటన



మురుగు సమస్యను పరిశీలిస్తున్న అధికారులు

వేపాడ: ఆతవ గ్రామంలోని ఎస్సీకాలనీలో నిలిచిపోయిన మురుగునీరు కారణంగా దోమలు, ఈగలు విజృంభిస్తున్నాయని, అనారోగ్యపాలవుతున్నామని స్థానికులు వాపోతున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో తహసీల్దార్ ప్రసన్నకుమార్, ఈఓపీఆర్డీ ఉమ, పంచాయతీ కార్యదర్శి నానిబాబు, వీఆర్ఓ సత్యవతి, సచివాలయ సర్వేయర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ శుక్రవారం కాలనీలో పర్యటించారు. సమస్యను పరిశీలించి పరిష్కారంపై గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలతో మాట్లాడారు. మురుగు సమస్య పరిష్కారానికి సహకరించాలని కోరారు.